మొదలు పెట్టారు.. వదిలేశారు

- నిలిచిన కాచికల్, ఎర్రబెల్లిగూడెం మేచ రాజుపల్లికి వెళ్లే రోడ్డు విస్తరణ పనులు
- గుంతలమయంగా మారిన రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



గుంతలమయంగా కాచికల్ నుంచి ఎర్రబెల్లిగూడెం వెళ్లే రహదారులు

నెల్లికుదురు: మండలంలోని కాచికల్ నుంచి ఎర్రబెల్లిగూడెం మీదుగా మేచరాజుపల్లికి వెళ్లే రహదారికి రోడ్డు విస్తరణ పనులను చేపట్టేందుకు అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2023లో పదవీకాలం చివరి రోజున 7కిలోమీటర్లకు రూ.7కోట్ల నిధులు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ హడావుడిగా పనులు ప్రారంభించారు. ప్రభుత్వ వైఫల్యమో.. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో తెలియదు కాని రోడ్డు విస్తరణ పనులు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. నత్తే నయం అన్నట్టుగా కాంట్రాక్టర్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టాడు. రోడ్డు విస్తరణ పనులు ఉన్న రోడ్డుకు రెండు పక్కల మూడు ఫీట్లతో వెడల్పు చేసి కంకర పోసి అవసరమున్న వద్ద మోరీల నిర్మాణం చేపట్టారు. పనులు చేపడుతున్న క్రమంలో ఉన్న రోడ్డంతా గుంతలమయంగా మారింది. రెండు పక్కల కంకర పోసి తారు వేయకుండా రోడ్డు పనులను అర్ధాంతరంగా వదిలేశారు. దీంతో ప్రతినిత్యం ఈ రహదారి గుండా ప్రయాణం చేసే వాహనదారులు నరక యాతన పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రజాప్రతినిధులు స్పందించి తారు రోడ్డు వేసి మూడు గ్రామాల ప్రజలకు ఉపశమనం కల్పించాలని కోరుతున్నారు.

పనులు పూర్తి చేయాలి



మండలంలోని కాచికల్, ఎర్రబెల్లిగూడెం మీదుగా మేచరాజుపల్లికి వెళ్లే రోడ్డు వెడల్పు పనులు మొదలు పెట్టి మూడేళ్లు కావస్తున్నా తారు వేయకుండా అర్ధాంతరంగా వదిలేశారు. తొర్రూరు నుంచి మహబూబాబాద్ వరకు, నెల్లికుదురు నుంచి కేసముద్రం వరకు ప్రధాన రహదారులను పట్టించుకునే వారు లేరు. ఇప్పటికైన ప్రభుత్వం కాచికల్ రోడ్డు పనులను పూర్తి చేయాలి.

\- వెంకన్న, మేచరాజుపల్లి గ్రామస్తుడు

ప్రమాదకర ప్రాంతాల్లో జాగ్రత్తలు తప్పనిసరి


పెద్దవంగర: స్థానిక అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ కిశోర్

పెద్దవంగర: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రజలు అత్యంత అప్రమత్తగా ఉండాలని డీఎస్పీ కృష్ణ కిశోర్ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంతోపాటు పలు ప్రాంతాల్లోని చెరువులు, వాగులు, లెవల్ కల్వర్టులను స్థానిక తహసీల్దార్ మహేందర్, ఎంపీడీఓ వేణుమాధవ్‌తో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. నీటి మునిగిన రోడ్లు, వాగులు, దాటే ప్రయత్నం చేయకూడదు, చేపల వేటకు వెళ్లవద్దని హెచ్చరించారు. అత్యవర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ గణేష్, స్థానిక ఎస్సై క్రాంతికిరణ్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

నెల్లికుదురు: కురుస్తున్న భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలస్థాయి విపత్తుల యాజమాన్య కమిటీ చైర్మన్, మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న మండల ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని నెల్లికుదురు, నైనాల, రావిరాల, రాజులకొత్తపల్లి గ్రామాల చెరువులను వివిధ శాఖల అధికారులతో కలిసి ఆదివారం సందర్శించి పరిశీలించారు. అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి ప్రణ నష్టం, ఆస్తినష్టం జరుగకుండా జగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చంద నరేష్, ఎంపీడీఓ సింగారపు కుమార్, నీటిపారుదల శాఖ ఇంజనీర్లు రామదాసు, విజయ్, తులసి, విద్యుత్ ఏఈ సింధూ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్లాట్‌ఫాం


ప్లాట్‌ఫాంపై ఊడిపోయిన టైల్స్

గార్ల: గార్ల రైల్వేస్టేషన్ ఎగువ లైన్‌లో ప్రమాదకరంగా ఉన్న ప్లాట్‌ఫాంకు వెంటనే మరమ్మతులు చేపట్టి రైలు ప్రమాదాలను అరికట్టాలని రైల్వే ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఎగువలైన్‌లో ఉన్న ప్లాట్‌ఫాంకు అమర్చిన టైల్స్ పలుచోట్ల ఊడిపోయాయని, రాత్రి సమయంలో రైలు దిగుతున్న సమయంలో కిందకి చూడకుండా అదిమరిచి దిగితే రైలు కింద పడే ప్రమాదం పొంచి ఉంది. ఇట్టి విషయాలు రైల్వే అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని, వెంటనే మరమ్మతుల చేయించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న శ్రీనివాస్‌యాదవ్

దోర్నకల్: సంక్షేమ, అభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అమలవుతుండడంతో కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రజలు నమ్ముతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. మండలంలోని హూన్యాతండా, లింబ్యాతండా గ్రామపంచాయితీలలో ఆదివారం జరిగిన ఇందిరమ్మ పల్లెప్రగతి కార్యక్రమంలో శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో పేద, మధ్య తరగతి ప్రజలకు సంక్షేమ ఫలాలు నేరుగా అందుతున్నాయన్నారు. చాలా కాలం తరువాత అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు అందడంతో వారంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లాలూనాయక్, ఆంగోత్ వెంకన్న పగిడిపాల వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీనివాస్, డీజే శ్రీనివాస్, కోటేష్, తదితరులు పాల్గొన్నారు.

ఒకరిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్: అతివేగంగా, అజాగ్రత్తగా ద్విచక్రవాహనం నడిపి ప్రమాదానికి కారణమైన వ్యక్తిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి ఆదివారం తెలిపారు. పట్టణంలోని అంబేడ్కర్ కాలనీకి చెందిన గుగులోత్ ప్రకాష్ తన ద్విచక్ర వాహనంపై రైల్వేస్టేషన్ వైపునకు వస్తున్నాడు. ఎండీ.షరీఫ్ అనే వ్యక్తి మహబూబాబాద్ నుంచి పెనుగొండకు త్రిబుల్ రైడింగ్ చేస్తూ ద్విచక్ర వాహనంపై అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చి మంజీర వాటర్ ప్లాంట్ సమీపంలో ప్రకాశ్ వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ప్రకాశ్ ఎడమకాలుకు, ఛాతిపై తీవ్రగాయాలయి. పోలీసుస్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు. ఎవరైనా ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే వారిపై చట్టరీత్యా చర్య తీసుకుంటామని తెలిపారు.

వన్యప్రాణి మాంసం స్వాధీనం.. కేసు నమోదు

కొత్తగూడ: వన్యప్రాణిని వేటాడి చంపి వండుకుని తినేందుకు యత్నిస్తున్న వారి వద్ద నుంచి అటవీ శాఖ అధికారులు ఆదివారం మాంసం స్వాధీనం చేసుకున్నారు. ఎఫ్ఆర్వో వజరహత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని దుర్గారం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు సమీప అటవీ ప్రాంతంలో ఉచ్చులు వేసి కనుజు(మెకం)ను వేటాడి మాంసం కొందరికి విక్రయించడంతోపాటు వారు వండుకున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. మాంసం, వేటాడేందుకు ఉపయోగించిన ఇనుప వైర్‌ను స్వాధీనం చేసుకుని వన్యప్రాణి చట్టాల కింద ముగ్గురిపై కేసు నమోదు చేశారు. వన్యప్రాణులను వేటాడేందుకు యత్నిస్తే వారిపై కేసు నమోదు చేయడమే కాకుండా పోడు భూములను సైతం స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

నీటిని తరలిస్తే సహించేది లేదు


మాట్లాడుతున్న లక్ష్మణ్‌నాయక్

గార్ల: గార్ల మండలం నుంచి మున్నేరు నీటిని పాలేరుకు తరలించేందుకు ప్రభుత్వం చేస్తున్న కుట్రలను తిప్పికొట్టేందుకు ఈ ప్రాంత రైతులతో కలిసి పోరాటం చేస్తామని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. ఆదివారం స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇట్టి నీరు గార్ల మండలం గుండా కాల్వల ద్వారా తీసుకెళ్తే, ఈ ప్రాంత రైతాంగం ఎలా చూస్తూ ఊరుకుంటారన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మున్నేరు నీటిని ఈ మండలంలోని భూములకు సాగునీరు అందిస్తూ, పాలేరుకు తీసుకెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ధరావత్ సక్రు, ఉమేష్ పాల్గొన్నారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి


కేసముద్రం: రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గూడూరు: ప్రభుత్వం రైతాంగానికి సరిపడా యూరియా సరఫరా చేయాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమాక్రసీ సబ్ డివిజన్ కమిటీ నాయకుడు జోగ రణధీర్, ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి సిద్ధబోయిన జీవన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం యూరియా కొరతపై సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. గత నెల రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తూ ఇబ్బందులు పడుతున్నా ఎవరూ పట్టించుకోకుండా చోద్యం చూస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కొరత లేకుండా యూరియా సరఫరా చేయాలని, లేదినో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఆలకుంట్ల సాయిలు, జిట్టబోయిన రాంచంద్రు, దొంతోజు ఉపేందర్, రాంబాబు, యాకయ్య, షేర్ మధు, కందకట్ల సురేందర్ పాల్గొన్నారు.


గూడూరు: ఆందోళన చేస్తున్న నాయకులు


నెల్లికుదురు: సొసైటీ వద్ద బారులుదీరిన రైతులు

యూరియా బస్తాల కోసం నిరీక్షణ

నెల్లికుదురు: యూరియా బస్తాల కోసం ఉదయం 6గంటలకు వచ్చి లైన్‌లో నిలబడితే ఒక్క బస్తా కూడా దొరక లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సంఘటన మండలంలోని శ్రీరామగిరి, ఎర్రబెల్లిగూడెం గ్రామాల సొసైటీలల్లో ఆదివారం చోటుచేసుకుంది. మండలంలోని శ్రీరామగిరి సొసైటీకి వచ్చిన యూరియా బస్తాలు 222. వాటికోసం వచ్చిన లైను కట్టి నిలబడిన రైతులు సుమారు 700మంది. అంటే ముగ్గురిలో ఒక్కరికి ఒక్క యూరియా బస్తా దొరికింది. ప్రభుత్వం చర్యలు తీసుకుని అందరికి యూరియా బస్తాలు అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

సకాలంలో యూరియా అందించాలి

కేసముద్రం: రైతులకు సకాలంలో యూరియాను అందించాలంటూ మున్సిపాలిటీ కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆదివారం రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులు నీలం దుర్గేష్, మాజీ జెడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గుగులోతు వీరునాయక్, మండల ప్రధాన కార్యదర్శి కముటం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా సరఫరా చేయలేక చేతులెత్తేసిందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతులు వ్యవసాయాన్ని పండుగలా చేసుకున్నారన్నారు. కాంగ్రెస్ పాలనలో మాత్రం రైతులు అష్టకష్టాలు పడుతున్నారని విమర్శించారు. రైతులకు న్యాయం చేయలేని కాంగ్రెస్ సర్కార్ వెంటనే గద్దె దిగాలని వారన్నారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పి రాస్తారోకోను విరమింపజేశారు. కార్యక్రమంలో ధన్నసరి సొసైటీ డైరెక్టర్ రవీందర్‌రెడ్డి, రాహుల్, వెంకన్న, రవి, శ్రీను, ప్రభాకర్, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న అధికారులు

నెల్లికుదురు: శుభ్రమైన ఆహారం తీసుకుంటూ వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఆరోగ్యంగా ఉంటారని మండల ప్రత్యేక అధికారి జినుగు మరియన్న ఉపాధ్యాయులు, విద్యార్థినులకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలోని కేజీబీవీని తహసీల్దార్ చందా నరేష్‌తో కలసి సందర్శించి భోజన సదుపాయాలతోపాటు పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుగు సాగాలన్నారు. వ్యక్తి శుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

ఆర్టీసీ ప్రాంగణంలో సీసీ చేయించాలి


నాటు వేసి నిరసన తెలుపుతున్న నాయకులు

గూడూరు: జాతీయ రహదారి పక్కన గల ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణ ప్రదేశాన్ని మొత్తం సీసీ ఏర్పాటు చేయించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ యాదవ్ డిమాండ్ చేశాడు. మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమై, బురద గుంతలుగా తయారైంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నారు. ఈవిషయంపై ఆదివారం పార్టీ ఆధ్వర్యంలో వరినాటు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఆర్టీసీ అధికారులు స్పందించి వెంటనే సీసీ ఏర్పాటు చేయాలని కోరారు. లేనిచో ఆందోళన చేస్తామన్నారు. కార్యక్రమంలో రామయ్య, బుచ్చిరాములు, సత్తయ్య, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్లకు బోనాల సమర్పణ


కురవి: బలపాలలో బోనాలతో వెళ్తున్న భక్తులు

కురవి: మండలంలోని బలపాల గ్రామంలో ముదిరాజ్ కులస్తులు పెద్దమ్మ తల్లికి బోనాలను ఆదివారం సమర్పించారు. డప్పుచప్పుళ్లతో వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.


మహబూబాబాద్ రూరల్: కొత్తబజారులో..

మహబూబాబాద్ రూరల్: పట్టణంలోని కొత్త బజారు, పాతబజారులో గల ముత్యాలమ్మ తల్లుల దేవాలయాల్లో భక్తులు అమ్మవార్లకు బోనాలు సమర్పించి ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల సందడితో ఆలయం కిటకిటలాడింది.

సైబర్ మోసం.. రూ.90వేలు మాయం

మహబూబాబాద్ రూరల్: సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన ఓ సైబర్ కేసు వివరాలు వెల్లడించారు. పట్టణంలోని ఒక ప్రాంతానికి చెందిన గృహిణి మొబైల్‌కు వాట్సప్ ద్వారా ఒక లింక్ పంపించి, సైబర్ నెట్‌వర్క్, టెలిగ్రామ్ లింకు ద్వారా పెట్టుబడిపెడితే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని చెప్పారన్నారు. మొదట వాళ్ల పంపిన టెలిగ్రామ్ ఐడీలో స్కానర్ ద్వారా రూ.700 పంపించినప్పుడు సైబర్ నేరగాళ్లు తిరిగి బాధితురాలి ఖాతాకు రూ.910 జమ చేశారు. ఇలా సైబర్ నేరగాళ్లు ఆశచూపడం వల్ల వాళ్ల చెప్పిన 3రకాల ఖాతాల యూపీఐ నంబర్లకు మొత్తం రూ.90వేలు పంపించారని తెలిపారు. తర్వాత ఎలాంటి నగదు బాధితురాలి అకౌంట్లో జమకాలేదని, లావాదేవీలు జరిగిన ఫోన్ నంబర్లకు ఆమె ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ అయ్యింది. దీంతో తాను సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయానని గ్రహించి వెంటనే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కి కాల్ చేసి, పట్టణ పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

అనారోగ్యంతో ఒకరి మృతి

మహబూబాబాద్ రూరల్: అనారోగ్యంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. టౌన్ సీఐ గట్ల మహేందర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి జిల్లా పూసల గ్రామానికి చెందిన పూసల నాగరాజు (65) గత 20 ఏళ్ల నుంచి ఎలాంటి పని చేయకుండా ఇంటిని పట్టించుకోకుండా ఎక్కడపడితే అక్కడ తిరుగుతూ ఉన్నాడు. అడుక్కుని తింటూ తనకు నచ్చినప్పుడు ఇంటికి వెళ్లే వాడు. కాగా ఈ నెల 14వ తేదీన ఉదయం తన ఇంటి నుంచి బయటకు వచ్చి తిరిగి ఇంటికి వెళ్లలేదు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వచ్చి ఆసుపత్రి ఆవరణలోని క్యాంటీన్ దగ్గర మృతిచెందాడు. ఔట్ పోస్ట్ పోలీసు సిబ్బంది ఆదివారం ఉదయం గమనించి మృతుడి వద్ద గల ఓపీ చిట్టీ మీద రాసి ఉన్న ఫోన్ నెంబర్ ద్వారా ఆయన భార్య పూసల లక్ష్మికి సమాచారాన్ని తెలియజేశారు. ఆమె వచ్చి మార్చురీ గదిలో ఉన్న మృతదేహాన్ని చూసి గుర్తించి తన భర్త నాగరాజు అనారోగ్యంతో మృతిచెందాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించామని సీఐ తెలిపారు.

ఆదర్శ కమ్యూనిస్ట్ శ్రీనివాస్‌రెడ్డి

తొర్రూరు: నమ్మిన సిద్ధాంతం కోసం కడదాక పాటు పడిన ఆదర్శ కమ్యూనిస్టు నాయకుడు ముద్దం శ్రీనివాస్‌రెడ్డి అని ఎమ్మెస్సార్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాకుడు ముద్దం విక్రమ్‌రెడ్డి అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో శ్రీనివాస్‌రెడ్డి వర్ధంతి కార్యక్రమం ఆదివారం డివిజన్ కేంద్రంలో నిర్వహించారు. ఆయన స్థూపం వద్ద నివాళులర్పించారు. పట్టణంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఓమ భిక్షపతి, బొల్లం అశోక్, బందు మహేందర్, ఎండీ యాకూబ్, గణపురం లక్ష్మణ్, కోటగిరి కాంతం, తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన మున్నేరువాగు వరద ఉధృతి



మహబూబాబాద్: జిల్లా కేంద్రం శివారులోని మున్నేరువాగులో వరద ఉధృతి తీవ్రంగా పెరిగింది. వాగు లోలెవల్ బ్రిడ్జిని తాకుతూ వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. వరద ఉధృతిని ఎమ్మెల్యే మురళీనాయక్‌తో పాటు అధికారులు పరిశీలించారు

చెరువులను తలపిస్తున్న పొలాలు


మునిగిన పంటపొలం

చిన్నగూడూరు: మండలంలోని వరి పంట పొలాల్లో వర్షపు నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. మండల కేంద్రానికి చెందిన రైతు అనంతగిరి బ్రహ్మం పంట పొలం వద్ద ఉన్న రోడ్డు మధ్యలో మోరీ వేయకపోవడంతో పల్లపు ప్రాంతంలో నీరు పోయే మార్గం లేక వరద నీరు నిలిచిపోతున్నాయి. దీంతో పక్కనే ఉన్న వరి పంట పొలాల్లో నీరు చేరి వరి పొలాలు నీట మునిగే పరిస్థితి ఏర్పడిందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

సైకిళ్లు అందించడం అభినందనీయం



నెల్లికుదురు: మండలంలోని ఆలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకోవడానికి దూర ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు సైకిళ్లు అందించడం అభినందనీయమని ఎంఈఓ రామ్‌దాస్ అన్నారు. ఆదివారం పాఠశాలలో పూర్వ విద్యార్థులు రామరాజు, హరీశ్, మహేష్, అరుణ్‌పాల్, షరీఫ్ 8మంది విద్యార్థులకు సైకిళ్లను ఎంఈఓ చేతుల మీదుగా అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



నర్సింహులపేట: మండల కేంద్రంలోని హైస్కూల్‌కు చెందిన నలుగురు బాలికలు ఐఎస్‌జీఎఫ్ఐ అండర్-15 విభాగంలో రాష్ట్రస్థాయి వాలీబాల్ క్రీడలకు ఎంపికై నట్లు ఎంఈఓ రామ్మోహన్‌రావు తెలిపారు. బి.సుజాత, సీహెచ్.సంఘవి, ఎం.వైష్ణవి, ఎస్.లాస్య ఈనెల 18నుంచి ఇబ్రహీంపట్నంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికపై పీడీ శంకర్‌నాయక్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉన్నాం..

దోర్నకల్: భారీ వర్షాల నేపథ్యంలో ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కొనేందుకు అప్రమత్తంగా ఉన్నామని తహసీల్దార్ ఇమ్మానియల్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదివారం వివిధ శాఖల అధికారులతో మంత్రి సీతక్క, డిప్యూటీ స్పీకర్ రాంచంద్రునాయక్, ఇన్‌చార్జ్ కలెక్టర్, ఎస్పీలతో జరిగిన టెలీ కాన్ఫెరెన్స్‌లో వర్షాలతో ఎదురయ్యే ఇబ్బందులతో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి చర్చించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి నర్సింహమూర్తి, ఎంపీడీఓ శ్రీనివాస నాయక్, సీఐ బి.రాజేష్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్, ఏఈలు కిరణ్, హార్థిక పాల్గొన్నారు.

బీఆర్ఎస్ యూత్ మండల అధ్యక్షుడిగా అశ్విన్

నెల్లికుదురు: బీఆర్ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడిగా మండల కేంద్రానికి చెందిన హెచ్ అశ్విన్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేసి ప్రకటించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు.

ఘనంగా తీజ్ వేడుకలు



దోర్నకల్: దోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని సిగ్నల్‌తండాలో ఆదివారం తండా పెద్ద లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో తీజ్ వేడుకలు నిర్వహించారు. యువతులు తీజ్ బుట్టలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపు, అనంతరం బుట్టలను నిమజ్జనం చేశారు.

తొర్రూరు రూరల్: మండలంలోని సోమారపు కుంట తండాలో తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గోధుమ బుట్టలను ఎత్తుకుని తండాలో నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు.

ఆత్మహత్యకు యత్నించిన వ్యక్తిని కాపాడిన పోలీసులు



కేసముద్రం: భార్య కాపురానికి రావడంలేదనే మనస్తాపంతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించిన ఓ వ్యక్తి ప్రాణాలను బ్లూకోల్ట్ పోలీసులు కాపాడిన సంఘటన మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్‌కు చెందిన బండి బాలు అనే వ్యక్తి, తన భార్య కాపురానికి రాకపోవడంతో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో రైల్వేట్రాక్‌పై చేరుకుని, తాను ఆత్మహత్య చేసుకుంటానని 100 డయల్‌కు సమాచారం అందించాడు. దీంతో స్పందించిన బ్లూకోల్ట్ సిబ్బంది ఎండీ అలీం, రామకృష్ణ హుటాహుటిన రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. పట్టాలపై పడుకుని ఉన్న బాలుకు నచ్చజెప్పి పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి, తన సమస్య అడిగి తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరిస్తామని చెప్పి, సమీప బంధువులకు సమాచారం అందించి, వారికి అతన్ని అప్పగించారు. బ్లూకోట్ సిబ్బంది తక్షణమే స్పందించి ఒకరి ప్రాణాలు కాపాడటంతో, పలువురు అభినందించారు.